# ఆకుపచ్చని తెలంగాణే లక్ష్యం

- తొమ్మిదో విడుత కింద జిల్లాలో 44 లక్షల మొక్కలు నాటడమే లక్ష్యం
- 21న కేబుల్ బ్రిడ్జి ప్రారంభం
- హాజరుకానున్న మంత్రి కేటీఆర్
- కార్యక్రమాన్ని సక్సెస్ చేయాలి
- మంత్రి గంగుల కమలాకర్



కేబుల్ బ్రిడ్జి వద్ద ఏర్పాటు చేసిన ఐలాండ్‌ను పరిశీలించి కలెక్టర్‌తో మాట్లాడుతున్న మంత్రి గంగుల కమలాకర్

కార్పొరేషన్, జూన్ 19: తరగిపోతున్న అడవులకు పునర్జీవం పోయడం, ఫల, ఔషధ మొక్కలు పెంచి ఆరోగ్యవంతమైన తెలంగాణగా మార్చాలనే ఉద్దేశంతో సీఎం కేసీఆర్ హరితహారం కార్యక్రమం చేపట్టారని రాష్ట్ర బీసీ సంక్షేమం, పౌర సరఫరాల శాఖ మంత్రి గంగుల కమలాకర్ పేర్కొన్నారు. దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా సోమవారం కరీంనగర్ శివారు కేబుల్‌బ్రిడ్జి సమీపంలో తెలంగాణ హరితోత్సవం నిర్వహించారు. కార్యక్రమానికి మంత్రి హాజరై, మొక్కలు నాటారు. అనంతరం మాట్లాడుతూ, తెలంగాణలో చెట్ల సంఖ్య పెంచి ఆకుపచ్చని తెలంగాణగా మార్చాలన్న ఆలోచనతోనే ఈ హరితహారం సాగుతుందన్నారు. రాష్ట్రం ఏర్పడిన నుంచి ఇప్పటి వరకు కోట్లాది మొక్కలు నాటి సంరక్షించడంతో రాష్ట్రంలో పచ్చదనం వెల్లువిరుస్తున్నదన్నారు. ప్రతి గ్రామం, పట్టణంలో నర్సరీలు, ప్రకృతి వనాలు, బృహత్ ప్రకృతి వనాలు ఏర్పాటు చేసి పచ్చదనం పెంచడం జరుగుతుందన్నారు. తొమ్మిదో విడుత హరితహారం కింద కరీంనగర్ జిల్లాలో 44 లక్షల మొక్కలు నాటడమే లక్ష్యంగా పెట్టామని, హరిత దినోత్సవం సోమవారం ఒక్కరోజే 6లక్షల మొక్కలు నాటామని, పర్యావరణ పరిరక్షణ, పచ్చదనం పెంపునకు లక్షలాది మొక్కలు నాటి భావితరాలకు అందివ్వాలన్నారు. మొక్కలు నాటి సంరక్షించాల్సిన అందరిపై బాధ్యత ఉందన్నారు. ఈ నెల 21న మంత్రి కేటీఆర్ కేబుల్ బ్రిడ్జిని ప్రారంభిస్తారని, అనంతరం పెద్ద ఎత్తున సాంస్కృతిక కార్యక్రమాలను నిర్వహిస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమానికి ప్రజలు పెద్ద సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో కలెక్టర్ ఆర్‌వీ కర్ణన్, నగర మేయ ర్ యాదగిరి సునీల్‌రావు, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ పొన్నం అనిల్‌కుమార్ గౌడ్, మున్సిపల్ కమిషనర్ సేవా ఇస్లావత్, కార్పొరేటర్లు ఆకుల పద్మ ప్రకాష్, కోల మాలతి సంపత్, ప్రజాప్రతినిధులు, అధికారులు పాల్గొన్నారు.

## ఓటర్లుగా నమోదు చేసుకోవాలి

- కలెక్టర్ ఆర్‌వీ కర్ణన్
- ట్రాన్స్‌జెండర్లకు గుర్తింపు కార్డులు అందజేత



ట్రాన్స్‌జెండర్‌కు గుర్తింపు కార్డు అందజేస్తున్న కలెక్టర్, సీపీ

కలెక్టరేట్, జూన్ 19: జిల్లాలోని ట్రాన్స్‌జెండర్లు ఓటర్లుగా తమ పేర్లు నమోదు చేసుకోవాలని కలెక్టర్ ఆర్‌వీ కర్ణన్ సూచించారు. మహిళా, శిశు సంక్షేమశాఖ ఆధ్వర్యంలో సోమవారం కలెక్టరేట్‌లోని కాన్ఫరెన్స్‌హాల్‌లో పలువురు ట్రాన్స్‌జెండర్లకు గుర్తింపు కార్డులు అందజేసి, మాట్లాడారు. జిల్లాలో ఇప్పటికే 17మంది ట్రాన్స్‌జెండర్లకు గుర్తింపు కార్డులు అందించామని వెల్లడించారు. ఇంకా ఎవరైనా ఉంటే జిల్లా మహిళా సంక్షేమాధికారి కార్యాలయంలో దరఖాస్తు చేసుకోవాలన్నారు. ప్రతి ట్రాన్స్‌జెండర్ ఓటరు కార్డు కోసం ఫారం-6 నింపి సమీప బీఎల్‌వోకు అందించాలని స్పష్టంచేశారు. ప్రభుత్వం నుంచి ట్రాన్స్‌జెండర్లకు కావాల్సిన అన్ని సర్టిఫికెట్లు అందజేసేందుకు జిల్లా యంత్రాంగం సిద్ధంగా ఉందన్నారు. ఎన్నికల సంఘం ట్రాన్స్‌జెండర్లకు ఓటు హక్కు కల్పించిందని, ప్రతిఒక్కరూ జాబితాలో పేర్లు నమోదు చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో సీపీ ఎల్ సుబ్బారాయుడు, డీసీపీ శ్రీనివాస్, ఆర్డీవో ఆనంద్‌కుమార్, ఇన్‌చార్జి డీడబ్ల్యూవో సబిత, సఖీ సెంటర్ అడ్మిన్ లక్ష్మి, స్పెషల్ బ్రాంచ్ ఇన్‌స్పెక్టర్ వెంకటేశ్వర్లు, సూపరింటెండెంట్ ఆర్ శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.





మంత్రి ఐకే రెడ్డి చేతుల మీదుగా ఉత్తమ సేవా పత్రాలు అందుకుంటున్న కరీంనగర్ మున్సిపల్ కమిషనర్ సేవా ఇస్లావత్, ఎలగందుల సర్పంచ్ షర్మిల, ఎంపీడీవో శ్రీనివాస్‌రెడ్డి, కార్యదర్శి విజయలక్ష్మి

## ‘హరిత’ సేవకు ప్రశంస

హరితహారంలో భాగంగా మొక్కలు నాటి పచ్చదనాన్ని పెంచినందుకు జిల్లాకు రెండు ఉత్తమ సేవా పత్రాలు దక్కాయి. తెలంగాణ దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా ప్రభుత్వం ఈ అవార్డులను ప్రకటించగా, లక్ష జనాభాకు పైబడిన పట్టణాల్లో కరీంనగర్ నగరపాలక సంస్థకు రాష్ట్ర స్థాయిలో ఉత్తమ హరిత అవార్డు దక్కగా మున్సిపల్ కమిషనర్ సేవా ఇస్లావత్ అందుకున్నారు. బృహత్‌పల్లె ప్రకృతి, ఈత, పల్లె ప్రకృతి వనాల నిర్వహణ పకడ్బందీగా చేపట్టి మొక్క ల పెంపకంలో అగ్రభాగాన నిలిచినందుకు కొత్తపల్లి మండలం ఎలగందల సర్పంచ్ ఎర్డండి షర్మిల, ఎంపీడీవో శ్రీనివాస్‌రెడ్డి, కార్యదర్శి విజయలక్ష్మి ఉత్తమ సేవాపత్రాలు అందుకున్నారు. సోమవారం హైదరాబాద్‌లోని రవీంద్రభారతిలో జరిగిన తెలంగాణ హరిత దినోత్సవ వేడుకల్లో రాష్ట్ర అటవీశాఖ, దేవాదాయ శాఖ మంత్రి అల్లోల ఇంద్రకరణ్‌రెడ్డి, రాష్ట్ర హోం మంత్రి మహమూద్ అలీ అందజేశారు.

- కార్పొరేషన్/ కొత్తపల్లి, జూన్ 19

## పల్లెల్లో హరిత కాంతులు

- సీఎం కేసీఆర్ కృషితో పెరిగిన అటవీ విస్తీర్ణం
- చొప్పదండి ఎమ్మెల్యే సుంకె రవిశంకర్
- కొదురుపాకలో హరితోత్సవం



కొదురుపాకలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే సుంకె రవిశంకర్

బోయినపల్లి, జూన్ 19: స్వరాష్ట్రంలోనే పల్లె పల్లెనా హరితకాంతులు వెదజల్లుతున్నాయని చొప్పదండి ఎమ్మెల్యే సుంకె రవిశంకర్ పేర్కొన్నారు. సమైక్య పాలకులు ప్రకృతి వనరులను విధ్వంసం చేస్తే, సీఎం కేసీఆర్ ముందుచూపుతో హరితహారం చేపట్టి అటవీ విస్తీర్ణం పెంపునకు కృషిచేశారని కొనియాడారు. రాష్ట్ర అవతరణ దశాబ్ది వేడుకల్లో భాగంగా సోమవారం కొదురుపాకలో హరితోత్సవం నిర్వహించగా, ఎమ్మెల్యే సుంకె రవిశంకర్, బీఆర్‌ఎస్ రాష్ట్ర నేత రవీందర్‌రావు హాజరయ్యారు. అనంతరం వారు కొదురుపాక ఆర్‌అండ్‌ఆర్ కాలనీలోని ఎంఎంఆర్ జీరో పాయింట్ కట్ట వద్ద వెయ్యి మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, తెలంగాణను హరితమయంగా మార్చేందుకు సీఎం కేసీఆర్ ఊరూరా నర్సరీలు ఏర్పాటు చేశారన్నారు. ఎంపీ జోగినపల్లి సంతోష్‌కుమార్ గ్రీన్‌ఇండియా చాలెంజ్‌లో భాగంగా పచ్చదనం పెంపులో కీలకభూమిక పోషిస్తున్నారని ప్రశంసించారు. సర్కారు అమలు చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలతో అన్ని వర్గాల ప్రజలు సంతోషంగా ఉన్నారన్నారు. ఇది ఓర్వలేని ప్రతిపక్షాలు రాద్ధాంతం చేస్తున్నాయని మండిపడ్డారు. ప్రతిపక్షాల మోసపూరిత మాటలను ప్రజలు నమ్మరని, వచ్చే ఎన్నికల్లో బీఆర్‌ఎస్ అధికారంలోకి రావడం ఖాయమని ధీమా వ్యక్తం చెప్పారు. జడ్పీ చైర్‌పర్సన్ న్యాలకొండ అరుణ మాట్లాడుతూ, సీఎం కేసీఆర్ పాలన దేశానికే ఆదర్శమని కొనియాడారు. బీజేపీ, కాంగ్రెస్ నాయకుల కల్లబొల్లి మాటలను ప్రజలు నమ్మబోరని పేర్కొన్నారు. భావితరాలకు పచ్చని ప్రకృతిని కానుకగా అందించేందుకే సర్కారు హరితహారం చేపట్టిందన్నారు. ఈ కార్యక్రమంలో అన్నివర్గాలు భాగస్వాములు కావాలని కోరారు. కార్యక్రమంలో డీసీఎంఎస్ మాజీ చైర్మన్ ముదుగంటి సురేందర్‌రెడ్డి, డీఎఫ్‌వో సీహెచ్ బాలమణి, జడ్పీ సీఈవో గౌతంరెడ్డి, ఎంపీపీ పర్లపల్లి వేణుగోపాల్, జడ్పీటీసీ కత్తెరపాక ఉమా కొండయ్య, ఆర్‌బీఎస్ మండల కన్వీనర్ కొనుకటి లచ్చిరెడ్డి, ఏఎంసీ చైర్మన్ లెంకల సత్యనారాయణరెడ్డి, వైస్ ఎంపీపీ కొనుకటి నాగయ్య, సెస్ డైరెక్టర్ కొట్టెపల్లి సుధాకర్, ఎంపీడీవో నల్ల రాజేందర్‌రెడ్డి, ఎంఈవో శ్రీనివాస్, ఎంపీవో గంగాతిలక్, ఏపీవో సబిత, సర్పంచులు బూర్గుల నందయ్య, చిందం రమేశ్, ఒంటెల గోపాల్‌రెడ్డి, కన్నం మధు, వంగపల్లి సత్యనారాయణరెడ్డి, ఉప సర్పంచ్ రవిచందర్, బీఆర్‌ఎస్ మండలాధ్యక్షుడు కత్తెరపాక కొండయ్య, కోఆప్షన్ సభ్యుడు ఎండీ అజ్జు, నాయకులు అంజ న్‌రావు, శంకర్, లక్ష్మీరాజం, రవి, రాములు, పురుషోత్తంరెడ్డి, మల్లారెడ్డి, శ్రీనివాస్, స్వామి, నాగరాజు, రమేశ్, మల్లేశం, సాగర్, తిరుపతి, శ్రీనివాసరెడ్డి, సురేందర్‌రెడ్డి, గంగారెడ్డి, మధు ఉన్నారు.

## హరితహారానికి అంకితమవుదాం

- ఎమ్మెల్యే చెన్నమనేని రమేశ్ బాబు

వేములవాడ, జూన్19: సీఎం కేసీఆర్ తలపెట్టిన హరిత మహోత్సవంలో గొప్పగా మొక్కలు నాటి హరితహారానికి అంకితమవుదామని ఎమ్మెల్యే చెన్నమనేని రమేశ్‌బాబు పిలుపునిచ్చారు. దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా వేములవాడ మున్సిపాలిటీ పరిధిలోని చెక్కపల్లి రహదారిలో సోమవారం హరిత మహోత్సవాన్ని నిర్వహించారు. ఎమ్మెల్యే రమేశ్‌బాబు హాజరై, మొక్కలు నాటారు. అనంతరం ఆయన మాట్లాడుతూ, సీఎం కేసీఆర్ తలపెట్టిన హరితహారంతో రాష్ట్రంలో అడవులు ఎనిమిది శాతం పెరిగాయని గుర్తుచేశారు. వాతావరణ సమతుల్యతను కాపాడేందుకు ప్రతిఒక్కరూ హరితహారంలో సంపూర్ణంగా పాలుపంచుకోవాలని పిలుపునిచ్చారు. హరితహారంలో భాగంగా వేములవాడ మున్సిపాలిటీ పరిధిలో ఏటా లక్షా 20 వేల మొక్కల టార్గెట్‌తో మొక్కలు నాటుతున్నారని చెప్పారు. అందులో భాగంగా 80వేల మొక్కలను ప్రతి ఇంటికీ 6మొక్కల చొప్పున అందిస్తూ నాటేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు చెప్పారు. వేములవాడ పట్టణం తెలంగాణ రాక ముందు ఎలా ఉండేది? ఇప్పుడెలా ఉన్నది? అనేది ప్రజలకు తెలుసన్నారు. ప్రతిపక్షాలు నిర్మాణాత్మకమైన విమర్శలు చేస్తే బాగుంటుందని, వాటిని తప్పక స్వాగతిస్తామని అన్నారు. ఎన్నికల్లో ఓట్ల కోసం మాత్రమే చేసే విమర్శలను ప్రజలు పట్టించుకోరని హితవు పలికారు. హరిత మహోత్సవంలో భాగంగా 200 మొక్కలు నాటామని మున్సిపల్ చైర్ పర్సన్ రామతీర్థపు మాధవి తెలిపారు. ఈ కార్యక్రమంలో కమిషనర్ అన్వేశ్, కౌన్సిలర్లు మారం కుమార్, జోగిని శంకర్, సిరిగిరి రామచందర్, యాచమనేని శ్రీనివాసరావు, బింగి మహేశ్, ఇప్పపూల అజయ్, నరాల శేఖర్, మేనేజర్ సంపత్‌రెడ్డి, ఏఈ నర్మదా, కోఆప్షన్ సభ్యులు బాబున్, పార్టీ అధ్యక్షులు పుల్కం రాజు, నాయకులు రామతీర్థపు రాజు, అయిల్నేని సుధాకర్ రావు, కందుల క్రాంతి కుమార్, కుమ్మరి శ్రీనివాస్, నరాల దేవేందర్, జడల శ్రీనివాస్, రాము తదితరులు ఉన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ అనురాగ్ జయంతి

## ఓటరు జాబితాలో నమోదయ్యేలా చూడాలి

- కలెక్టర్ అనురాగ్ జయంతి
- ఓటరు జాబితా సవరణ, ఇంటింటి సర్వేపై సమీక్ష

కలెక్టరేట్, జూన్ 19: జిల్లాలో 1 అక్టోబర్ 2023 వరకు 18ఏండ్లు నిండిన వారందరూ ఓటరు జాబితాలో నమోదయ్యేలా చూడాలని కలెక్టర్ అనురాగ్ జయంతి అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లోని సమావేశ హాల్‌లో ఓటరు జాబితా సవరణ, ఇంటింటి సర్వే తదితర అంశలపై రాజకీయ పార్టీల ప్రతినిధులతో కలెక్టర్ సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, ఈనెల 25 నుంచి 23 వరకు బూత్ లెవల్ అధికారుల ద్వారా ఓటరు జాబితా సవరణపై ఇంటింటి సర్వే నిర్వహించనున్నట్లు తెలిపారు. ఇందుకు ప్రతిఒక్కరూ సహకరించేలా చూడాలని కోరారు. ఈ ఏడాదిఅక్టోబర్ 1వ తేదీ వరకు 18 ఏండ్లు నిండే వారందరూ ఓటుహక్కుకు దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. సమీక్షలో తహసీల్దార్ విజయ్‌కుమార్, ఎన్నికల విభాగం ఉప తహసీల్దార్ రెహమాన్, అన్ని రాజకీయ పార్టీల ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.